సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 29 । మార్చి । 2025



టన్ను చీనీ రూ.22,120

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22,120, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.9

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.9, కనిష్టంగా రూ.6 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 120 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.



న్యూస్‌రీల్

'నాడు-నేడు' మెటీరియల్ విక్రయం!

- అడ్డదారిలో అమ్ముకున్న హెచ్‌ఎం, పీఎంసీ చైర్మన్



బిందూనగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఇనుప కడ్డీలను ట్రాక్టరులో తరలిస్తున్న దృశ్యం

పరిగి: పాఠశాలల రూపురేఖలు మార్చే ఉద్దేశంతో గత వైఎస్ జగన్ సర్కార్ చేపట్టిన నాడు-నేడు పనులు కూటమి సర్కార్ హయాంలో అర్ధంతరంగా ఆగిపోయాయి. దీన్ని ఆసరాగా చేసుకున్న ఓ హెచ్‌ఎం, పీఎంసీ చైర్మన్‌తో కలిసి 'నాడు-నేడు' పనుల కోసం తెచ్చిన ఐరన్‌ను అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బిందూనగర్ ప్రాథమిక పాఠశాలలో గతంలో నాడు- నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఈ క్రమంలో పాఠశాలలో 470 కిలోల ఇనుప కడ్డీలు మిగిలిపోయాయి. దీంతో వాటిని విక్రయించాలనుకున్న స్కూల్ హెచ్‌ఎం, పీఎంసీ చైర్మన్ ఇటీవల నామమాత్రపు తీర్మానం చేశారు. ఆ తీర్మాన నకలు కాపీని కూడా మండల విద్యాశాఖకు పంపకుండా శుక్రవారం ఏకంగా ట్రాక్టరులో ఐరన్ కడ్డీలు తరలించి కిలో రూ. 40 చొప్పున విక్రయించారు. గతంలో ఇదే ఇనుప కడ్డీని కిలో రూ. 50 చొప్పున గత ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు సమాచారం. అయితే పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుడు కూటమి నాయకులతో కుమ్మక్కై ఇలా పాఠశాలకు వచ్చిన ఇనుప వస్తువులను విక్రయించారని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఈ ఘటనపై శనివారం సమగ్ర విచారణ చేపడతామని, అనంతరం చర్యలు తీసుకుంటామని పరిగి ఎంఈఓ శేషాచలం తెలిపారు.

'ఈ-శ్రమ్' ఎక్స్‌గ్రేషియా దరఖాస్తుకు 31 వరకూ గడువు

ప్రశాంతి నిలయం: అసంఘటిత రంగ కార్మికులు 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో ఎక్స్‌గ్రేషియా క్లెయిములు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు జిల్లా సహాయ కార్మిక కమిషనర్ సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఈ-శ్రమ్' గుర్తింపు కార్డు కలిగి ఉన్నవారు మాత్రమే ఎక్స్‌గ్రేషియా క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. 2022 మార్చి 31వ తేదీ లోపు ప్రమాదవశాత్తూ మరణించిన అసంఘటిత కార్మికుల నామినీ దారులు డీఆర్‌డీఏ పీడీ కార్యాలయంలో దరఖాస్తు ప్రాసెస్ చేసుకోవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 9100825189 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఈ-కేవైసీ గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగింపు

ప్రశాంతి నిలయం: రేషన్ కార్డులకు సంబంధించి ఈ-కేవైసీ నమోదు గడువును ప్రభుత్వం ఏప్రిల్ 30 వరకు పొడిగించింది. గడువులోపు జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ) కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికీ జిల్లాలోని కార్డుదారుల్లో ఈ-కేవైసీ చేయించుకోని వారి జాబితా పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ల వద్ద ఉంటుందని అధికారులు తెలిపారు. జాబితాలో పేరు ఉన్నవారు సంబంధిత రేషన్ షాపు లేదా వీఆర్‌ఓ లేదా సచివాలయ సిబ్బంది వద్దకు వెళ్లి ఈ-పాస్ యంత్రంలో కానీ వీఎస్‌డబ్ల్యూఎస్ మొబైల్ యాప్‌లో కానీ వేలిముద్ర వేసి ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు.

రచ్చ చేసి.. వాయిదా వేయించి!

టీడీపీ నేతలు రౌడీల్లా మారారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలు ఎన్నుకున్న ఎంపీటీసీలను తీవ్రంగా భయపెట్టారు. అధికార అండతో దాడులు, దౌర్జన్యాలకు దిగారు. పార్టీ మారాలని బెదిరించారు. ఫిరాయిస్తే డబ్బులతో పాటు పదవులు ఆఫర్ చేశారు. ఒప్పుకోకపోతే కిడ్నాప్‌లకు పాల్పడ్డారు. బలం లేకపోయినా ఎంపీపీ స్థానాలను దక్కించుకునేందుకు అరాచకాలకు తెగబడ్డారు. ఈ నేపథ్యంలోనే ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు శుక్రవారం నాటి ఎంపీపీ ఎన్నికలకు గైర్హాజరయ్యారు. ఫలితంగా రామగిరి, గాండ్లపెంట ఎంపీపీ ఎన్నికలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

పచ్చ కుట్ర.. ప్రజాస్వామ్యం ఖూనీ

- ఎంపీపీ ఎన్నికల్లో టీడీపీ నేతల దాష్టీకం
- వైఎస్సార్‌సీపీ సభ్యులకు బెదిరింపు కాల్స్
- భయాందోళనకు లోనైన ఎంపీటీసీ సభ్యులు
- హాజరు కాలేమని తేల్చి చెప్పిన వైనం
- కోరంలేక రామగిరి, గాండ్లపెంట ఎంపీపీ ఎన్నికలు నిరవధిక వాయిదా





రామగిరిలో ఎంపీపీ ఎన్నికకు టీడీపీ తరఫున హాజరైన ఎంపీటీసీ సభ్యులు, రామగిరి ఎంపీపీ ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న అధికారి సంజీవయ్య

సాక్షి, పుట్టపర్తి/రామగిరి/గాండ్లపెంట: ప్రశాంత వాతావరణంలో జరగాల్సిన ఎన్నికల్లో టీడీపీ నేతలు అల్లకల్లోలం సృష్టించారు. సభ్యులు లేకున్నా.. సంఖ్యాబలం తక్కువగా ఉన్నా.. అడ్డదారిలో ఎన్నికల్లో నెగ్గాలని చూసి ఘోరంగా విఫలమయ్యారు. టీడీపీ నేతలు పాల్పడుతున్న దుశ్చర్యలతో ఎంపీపీ ఎన్నికల్లో పాల్గొనేందుకు సభ్యులు వెనుకంజ వేశారు. ఫలితంగా కోరం (మూడింట రెండో వంతు) లేక గాండ్లపెంట, రామగిరి ఎంపీపీ ఎన్నికలను నిరవధిక వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

అల్లర్లు సృష్టించి.. కిడ్నాప్ చేసి..

టీడీపీ నేతల దౌర్జన్యం..దుర్మార్గ చర్యలతో రామగిరి ఎంపీపీ ఉప ఎన్నికలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రామగిరి మండలంలో పది ఎంపీటీసీ స్థానాలుండగా, గత స్థానిక సంస్థల ఎన్నికల్లో తొమ్మిది స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయ ఢంకా మోగించారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత పంచాయతీ నసనకోట ఎంపీటీసీ స్థానం మాత్రం టీడీపీ దక్కించుకోగలిగింది. ఎంపీపీగా ఉన్న మీనుగ నాగమ్మ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా... ప్రస్తుతం ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. రామగిరి ఎంపీపీ స్థానం జనరల్ మహిళకు రిజర్వు కాగా, మహిళా సభ్యులు లేని టీడీపీ... వైఎస్సార్ సీపీ మహిళా ఎంపీటీసీలను భయపెట్టి పార్టీలో చేర్చుకుని ఎంపీపీ స్థానం దక్కించుకునేందుకు శతవిధాలా ప్రయత్నించింది. హింసను ప్రేరేపిస్తూ దాడులకూ దిగింది. ఎన్నికకు ఒకరోజు ముందుగానే టీడీపీ నేతలు రామగిరి ఎంపీడీఓ కార్యాలయం వద్ద అల్లర్లు సృష్టించారు. అధికారులకు అనెక్సర్ 1, 2 ఇచ్చేందుకు వెళ్లిన వైఎస్సార్ సీపీ నేతలను ఎంపీడీఓ కార్యాలయంలోకి లాక్కెళ్లి దాడి చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులకు సంబంధించిన వాహనాల అద్దాలన్నీ ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురిచేశారు. ఇక గురువారం కర్ణాటకలో ఉన్న ఎంపీటీసీ సభ్యులు ఎన్నికలో పాల్గొనేందుకు రామగిరికి వస్తుండగా.. బాగేపల్లి టోల్‌గేట్ నుంచి అడుగడుగునా అడ్డగించే యత్నం చేశారు. అనంతరం పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు భారతిని బలవంతంగా తమ వాహనాల్లో అపహరించారు. దీంతో పెనుకొండ, రామగిరిలో భయానక వాతావరణం నెలకొంది.

రామగిరికి రాం.. రాం..

తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నడుమ గురువారం కోరంలేక రామగిరి ఎంపీపీ ఎన్నిక వాయిదా పడగా, అధికారులు శుక్రవారం ఎన్నిక నిర్వహిస్తామని ప్రకటించారు. అయితే గురువారం నాటి పరిస్థితులను చూసి భయపడిపోయిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు ఎన్నికలో పాల్గొనేందుకు నిరాకరించారు. ఇక శుక్రవారం ఉదయమే టీడీపీ తరఫున నలుగురు సభ్యులు మాత్రం ఎంపీడీఓ కార్యాలయం చేరుకున్నారు. మిగతా వారు రాకపోవడంతో కోరం లేక ఎన్నికను నిరవధిక వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి సంజీవయ్య ప్రకటించారు. ఈ విషయాన్ని ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లామని, మళ్లీ ఎప్పుడు ఎన్నిక నిర్వహించేది రాష్ట్ర ఎన్నికల సంఘమే ప్రకటిస్తుందని ఆయన వెల్లడించారు. ఆ వెంటనే టీడీపీ నేతలు రామగిరిలో బాణసంచా పేలుస్తూ సంబరాలు చేసుకుని పైశాచికత్వాన్ని ప్రదర్శించారు.



ఎన్నిక వాయిదా పడటంతో రామగిరిలో బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నేతలు


ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయలేం




ఎంపీపీ ఎన్నికకు రాలేమని చెబుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు

''గురువారం జరిగిన టీడీపీ నేతల దౌర్జన్యకాండ చూస్తే భయమేస్తోంది. ఎంపీటీసీ సభ్యురాలు భారతిని పోలీసులే దగ్గరుండి కిడ్నాప్ చేయించారు. ఇప్పుడు మేము ఎంపీపీ ఎన్నికకు వెళ్తే...వాళ్లే సంతకాలు చేసుకుని తాము టీడీపీకి మద్దతు తెలిపినట్లు ప్రచారం చేస్తారు. దీనివల్ల ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంది. అందుకే మేము ఎంపీపీ ఎన్నికకు రాలేం'' అంటూ వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు ఎనుముల సుజాత, వెంకటలక్ష్మమ్మ, ఆదిలక్ష్మి, సాయిలీల, కొండయ్య గుర్తు తెలియని ప్రాంతం నుంచి వీడియో సందేశం పంపారు. హైకోర్టు జోక్యం చేసుకుని మెజార్టీ ఉన్న తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

పారని 'కందికుంట' పాచిక



ఏడుగురు ఎంపీటీసీలకు గాను హాజరైన ముగ్గురు సభ్యులు



మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికను నిర్వహించేందుకు హాజరైన అధికారులు

గాండ్లపెంట ఎంపీపీ ఎన్నిక జరిగితే ఓడిపోతామని తెలిసిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వైఎస్సార్‌సీపీ సభ్యులను నామినేషన్ దాఖలు చేయనీయకుండా అడ్డుకున్నారు. దీంతో నామినేషన్ గడువు ముగిసిందని గురువారం రోజున జరగాల్సిన ఎన్నిక శుక్రవారానికి వాయిదా పడింది. అంతలోపే వైఎస్సార్ సీపీకి చెందిన ఇద్దరు సభ్యులను ప్రలోభాలకు గురి చేసి టీడీపీలో చేర్చుకున్నారు. అయితే శుక్రవారం ఉదయం కేవలం ముగ్గురు సభ్యులు మాత్రమే ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఎన్నిక జరగాలంటే కనీసం ఐదుగురు సభ్యులు ఉండాలి. టీడీపీ నేతల నిర్వాకంతో తమకు ఎన్నిక అవసరం లేదని వైఎస్సార్‌సీపీ సభ్యులు ఎన్నికకు గైర్హాజయ్యారు. ఫలితంగా గాండ్లపెంట ఎంపీపీ ఎన్నిక నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి విజయ్ ప్రసాద్ తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా, రాష్ట్ర అధికారులకు తెలియజేశామని, ఎన్నిక ఎప్పుడు నిర్వహించేది ఎన్నికల సంఘమే ప్రకటిస్తుందని వెల్లడించారు.

ప్రజారక్షణ మరచి.. పరిటాల సేవ

ప్రజలకు సేవ చేయాల్సిన కొందరు పోలీసులు రాజకీయ నాయకుల సేవలో తరిస్తున్నారు. వారు చెప్పినదల్లా చేస్తున్నారు. వీరి తీరును చూసి ప్రజలు చీత్కరించుకుంటున్నారు. నాయకుల ఇంట్లో ఊడిగం చేస్తున్నట్టు వ్యవహరిస్తున్న పోలీసుల తీరు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

బరితెగించిన ఎస్‌ఐ సుధాకర్ యాదవ్

- రామగిరి ఎంపీపీ ఎన్నికల్లో వీరంగం
- అడ్వొకేట్ అని చూడకుండా నోటికొచ్చినట్టు దుర్భాషలు
- 'కేసులు పెట్టి లోపలేస్తా కొడకల్లారా' అంటూ ఊగిపోయిన వైనం
- పరిటాల కుటుంబం ఏది చెప్తే అదే చట్టమనే రీతిలో చెలరేగుతున్న ఎస్‌ఐ



రామగిరి ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత (ఫైల్)



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ తాను పరిటాల కుటుంబానికి మాత్రమే సేవకుడినంటూ వ్యవహరిస్తున్నారు రామగిరి ఎస్‌ఐ సుధాకర్ యాదవ్. పరిటాల కుటుంబం ఏది చెబితే అదే నాకు 'లా' అన్నట్లు నడుచుకుంటున్నారు. తాజాగా రామగిరి ఎంపీపీ ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీడీఓకు నోటీసులు ఇవ్వడానికి వెళితే.. ఎస్‌ఐ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అడ్వొకేట్ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులును 'నా కొడకల్లారా.. కేసులు పెట్టి మిమ్మల్ని లోపలేస్తా.. ఇరగ్గొడతా..మిమ్మల్ని తన్నితే దిక్కెవరు' అంటూ విరుచుకుపడ్డారు. ఎస్‌ఐ నుంచి తమకు ప్రాణహాని ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు వాపోతున్నారు. ఎస్‌ఐ అండతోనే పేరూరు ఎంపీటీసీ సభ్యురాలు భారతిని పరిటాల మనుషులు తమ వాహనాల్లోకి ఎక్కించుకున్నారు.

పరిధి దాటి పెత్తనం


ఎంపీపీ ఎన్నిక కోసం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు ఆరుగురు గురువారం బెంగళూరు నుంచి రామగిరికి వెళుతుండగా.. బాగేపల్లి టోల్ ప్లాజా వద్దకు పోలీసులు చేరుకుని, హైకోర్టు ఉత్తర్వుల మేరకు బందోబస్తు మధ్య రామగిరి తీసుకెళ్తామని చెప్పారు. అక్కడి నుంచి ఏడు వాహనాల్లో వైఎస్సార్ సీపీ సభ్యులతో రామగిరికి బయలుదేరారు. అయితే కాన్వాయ్ చెన్నేకొత్తపల్లి దాటే సమయానికి మధ్యాహ్నం 12 గంటలైంది. ఆ సమయానికి రామగిరి ఎంపీడీఓ కార్యాలయానికి ముగ్గురు సభ్యులు మాత్రమే చేరుకోవడంతో నామినేషన్ దాఖలుకు గడువు మీరడంతో ఎన్నికను మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ ప్రకటించారు. ఎన్నిక వాయిదా పడినట్లు తెలియడంతో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను పెనుకొండ తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయడానికి పోలీసులు తీసుకెళ్లారు. కానీ సుధాకర్ రామగిరికి ఎస్‌ఐ అయినా పెనుకొండ వరకు వెళ్లారు. పెనుకొండ తహసీల్దార్ కార్యాలయంలో టీడీపీ కార్యకర్తలా రెచ్చిపోయారు. ఇతను పోలీసా.. రౌడీషీటరా అన్నట్టు వ్యవహరించారని ఘటనా స్థలంలో ఉన్న వారు చెబుతున్నారు.

ఖాకీ చొక్కాను అడ్డం పెట్టుకుని..

సుధాకర్‌ది ఆదినుంచీ ఇదే తీరు. ఇటీవల చిలమత్తూరులో తన భార్య పేరిట మూడెకరాల భూమి కొన్నారు. ఇక్కడ కోళ్లఫారం నిర్మిస్తున్నారు. ఈ భూమి చదును కోసం లేపాక్షి హబ్ భూముల నుంచి అక్రమంగా మట్టి తోలారు. గతంలో ఇలా మట్టి తోలినందుకు ఓ రియల్టర్‌కు మైనింగ్ శాఖ రూ.2 కోట్లు జరిమానా వేసింది. కానీ ఎస్‌ఐ సుధాకర్ మట్టి దందాను మాత్రం ఆ శాఖ పట్టించుకోలేదు. గతంలో సుధాకర్..టీడీపీ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డారు. అంతేకాదు గతంలో ఓ డీఎస్పీ మీద కరపత్రాలు వేసి వివాదాస్పదమయ్యారు. గుత్తిలో పనిచేసినప్పుడు సీఐతో గొడవకు దిగారు. ఇలా ఒకటేమిటి ఆయన ఎక్కడికెళ్లినా పసుపు కండువా కప్పుకున్న ఖాకీలాగే ప్రవర్తిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ హౌస్ అరెస్ట్

- రామగిరి ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో పోలీసుల చర్యలు
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయొద్దని కోరిన గిరిజమ్మ



జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ బయటకు వెళ్లకుండా కాపలా ఉన్న పోలీసులు

అనంతపురం సిటీ: రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి ఎంపీపీ ఎన్నిక సందర్భంగా జరుగుతున్న పరిణామాల్లో భాగంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను అనంతపురంలో రెండో పట్టణ పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్ట్ చేశారు. ఎంపీపీ ఎన్నిక గురువారం జరగాల్సి ఉండగా శుక్రవారానికి వాయిదాపడిన సంగతి తెలిసిందే. అయితే శుక్రవారం కూడా ఎన్నిక జరగలేదు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎస్పీలు జగదీశ్, వి.రత్న ఆదేశాల మేరకు ముఖ్య నేతలను హౌస్ అరెస్టు చేశారు. అందులో భాగంగా జెడ్పీలో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ క్యాంప్ కార్యాలయానికి ఉదయం 7 గంటలకే అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్, ఎస్‌ఐ రుష్యేంద్రబాబు, ఏఎస్‌ఐ గోవిందమ్మ, హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, కానిస్టేబుళ్లు లింగమ్మ, విజయ కుమార్ చేరుకున్నారు. అప్పటికే ఆమె రామగిరి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. హౌస్ అరెస్టు చేస్తున్నట్లు ఆమెకు సమాచారం అందించారు. సాయంత్రం 5 గంటల వరకు ఆమె గడపదాటి బయటకు రాలేకపోయారు.

హౌస్ అరెస్టులకు భయపడం..

ప్రజాస్వామ్య వ్యవస్థలో గృహ నిర్బంధాలు సరికాదని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఇటువంటి అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. సంపూర్ణ మెజారిటీ ఉన్నప్పటికీ అధికార పార్టీ నేతలు అడ్డదారుల్లో ఎంపీపీ పదవి దక్కించుకునేందుకు ప్రయత్నించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అవుతుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునే ఆలోచనలో ఉన్న తమను పోలీస్ అధికారులను అడ్డుపెట్టుకుని హౌస్ అరెస్టు చేయించడం టీడీపీ నేతలకు తగదన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పునకు ఎవరైనా కట్టుబడి ఉండాలని, రాజకీయాల్లో నీతి, న్యాయం, ధర్మం వైపు నిలబడాలని ఆమె అభిప్రాయపడ్డారు.

సాయికీర్తనం.. సాంస్కృతిక వైభవం



తాండూలార్చన నిర్వహిస్తున్న భక్తులు



నాటిక ద్వారా కృష్ణ తత్వాన్ని వివరిస్తున్న యూత్ సభ్యులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి కొలువుదీరిన ప్రశాంతి నిలయంలో శుక్రవారం సాయికీర్తనలతో ఆంధ్రా సాంస్కృతిక వైభవం ఉట్టిపడింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన రెండు వేల మంది ఆంధ్రప్రదేశ్ యూత్ సభ్యులు ప్రశాంతి నిలయంలో శుక్రవారం ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తకోటిని మురిపించారు. ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సామూహిక తాండూలార్చన నిర్వహించారు. ఎదురుగా సత్యసాయి పాదుకలను ఉంచి మంత్రాలను పఠిస్తూ పూజలు నిర్వహించారు. అనంతరం సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. అంతకుమునుపు సత్యసాయి శతజయంతి వేడుకలను స్మరిస్తూ యజుర్ మందిరం నుంచి సత్యసాయి పాదుకలను ఊరేగింపుగా సాయికుల్వంత్ సభా మందిరానికి చేరుకున్నారు. సాయంత్రం సత్యసాయి బాలవికాస్ చిన్నారులు 'ధర్మో రక్షిత రక్షితః' పేరుతో చక్కటి సందేశాత్మక నాటికను ప్రదర్శించారు. రామాయణ ఘట్టంలో రాముని చరిత్ర, ధర్మాన్ని ఆచరించిన తీరును, భాగవతంలో కృష్ణుడు ధర్మ సంరక్షణకు పాటుపడిన తీరును చక్కగా వివరించారు.



'ధర్మో రక్షిత రక్షితః' నాటికలోని ఘట్టం

సత్యసాయి సేవలో సాయికుమార్

ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ శుక్రవారం సత్యసాయి సేవలో గడిపారు. ఉదయం ప్రశాంతి నిలయానికి విచ్చేసిన ఆయన.. నేరుగా వెళ్లి సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం ప్రశాంతి నిలయంలోని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజును కలిశారు. ఈ సందర్భంగా సత్యసాయి శత జయంతి వేడుకలు, సత్యసాయి ట్రస్ట్ సేవలు గురించి ఆర్‌జె. రత్నాకర్ రాజును అడిగి తెలుసుకున్నారు.



సత్యసాయి శతజయంతి వేడుకల లోగోను ఉంచి శరణు కోరుతున్న యూత్ సభ్యులు



ఆర్‌జె.రత్నాకర్ రాజుతో సినీ నటుడు సాయికుమార్

క్లుప్తంగా

జేఎన్‌టీయూ స్నాతకోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న వీసీ హెచ్.సుదర్శనరావు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) 14వ స్నాతకోత్సవం నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై వర్సిటీ అధికారులతో వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు శుక్రవారం సమీక్షించారు. వర్సిటీ ఛాన్సలర్, ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్‌ను స్నాతకోత్సవానికి ఆహ్వానించనున్న నేపథ్యంలో స్నాతకోత్సవ నిర్వహణకు సంబంధించి కమిటీల నియామకం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్డీ టూ వీసీ ప్రొఫెసర్ ఎన్.దేవన్న, వర్సిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓరియంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో అంజినప్పకు చోటు



అవార్డును చూపుతున్న ఉపాధ్యాయుడు అంజినప్ప

ధర్మవరం రూరల్: తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, కళాభిషేకం కార్యక్రమ నిర్వాహకుడు అంజినప్పకు ఓరియంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. కనుమరుగవుతున్న కళారూపాలకు పూర్వ వైభవం తీసుకురావాలనే సంకల్పంతో ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల్లో కళాభిషేకం పేరుతో 221 కార్యక్రమాలను పూర్తి చేసినందుకు గాను ఈ అవార్డు దక్కినట్లు అంజినప్ప తెలిపారు. కాగా, ధర్మవరం రూరల్ పరిధిలోని నాగలూరు వద్ద ఉన్న పీసీఎంఆర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన ఈ అవార్డును ఉత్తరప్రదేశ్‌లో అందుకోవాల్సి ఉండగా పదో తరగతి పరీక్షల నేపథ్యంలో వెళ్లలేకపోయారు. దీంతో ఆ సంస్థ వారు ఆయన ఇంటికి కొరియర్ ద్వారా అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా అంజినప్పను తోటి ఉపాధ్యాయులు, మిత్రులు అభినందించారు.

ప్రాణం బలిగొన్న ఈత సరదా



దాసరి భరత్

కణేకల్లు: ఈత సరదా ఓ యువకుడి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... కణేకల్లు మండలం కె.కొత్తపల్లి గ్రామానికి చెందిన దాసరి పార్వతమ్మ, శ్రీనివాసులు దంపతులకు ఇద్దరు కుమారులు కాగా రెండో కుమారుడు భరత్ (19) పదో తరగతి వరకు చదువుకుని హమాలీగా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. ఇతనికి ఈత బాగా వస్తుంది. శుక్రవారం తన స్నేహితులు మధు, శివ, బ్రహ్మయ్యతో కలసి గోపులాపురం గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న రైతు అంజి పొలంలోని వాటర్ సంప్‌లో ఈత కొట్టేందుకు వెళ్లాడు. సరదాగా ఈత కొడుతుండగా ఉన్నఫళంగా భరత్ నీటమునిగాడు. ఎంత సేపటికీ బయటికి రాకపోవడంతో స్నేహితులు భయాందోళనకు గురై, విషయాన్ని వెంటనే ఫోన్ ద్వారా గ్రామస్తులకు తెలిపారు. దీంతో స్థానికులు అక్కడకు చేరుకుని దాదాపు 13 అడుగుల లోతున నీటిలో విగతజీవిగా పడి ఉన్న భరత్‌ను గుర్తించి వెలికితీశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పది రోజులైనా అందని తాగునీరు



ఖాళీబిందెలతో రాస్తారోకో చేస్తున్న దృశ్యం



రైల్వే అండర్‌పాస్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

ధర్మవరం: పది రోజులైనా తాగునీరు వదలకుంటే తాము ఎలా బతకాలంటూ ధర్మవరంలోని వైఎస్సార్ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ప్రధాన రహదారిపై మహిళలు ఖాళీ బిందెలతో బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. గంటకుపైగా ట్రాఫిక్ స్తంభించింది. పదిరోజులైనా తాగునీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఈ సందర్భంగా మహిళలు మండిపడ్డారు. ఇంటి పన్ను, కొళాయి పన్నులు కట్టించుకునేందుకు వచ్చే మున్సిపల్ అధికారులు తాగునీరు సదుపాయం కల్పించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. తాగునీరు వదలకపోతే ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, మున్సిపల్ అధికారులు అక్కడకు చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడారు. తాగునీరు అందిస్తామంటూ భరోసానివ్వడంతో రాస్తారోకోను విరమించారు.

ఇదేం బాదుడు బాబూ?

- సామాన్యుల నడ్డివిరుస్తున్న కూటమి సర్కారు
- ఇంధన సర్దుబాటు పేరుతో భారీగా విద్యుత్ చార్జీల పెంపు
- ఎస్‌ఈ కార్యాలయ ముట్టడిలో సీపీఎం నాయకుల ధ్వజం



ఈఈ రమేష్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్: తమను గెలిపిస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత విపరీతంగా చార్జీలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ ధ్వజమెత్తారు. మాటలకు.. చేతలకు పొంతన లేకుండా ఈ బాదుడేంటి బాబు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్పతో కలిసి విద్యుత్ శాఖ ఎస్‌ఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ఇంధన సర్దుబాటు ధరల పేరిట విద్యుత్ వినియోగదారుల నుంచి రూ.వేల కోట్లు వసూళ్లు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ట్రూఅప్, సర్ చార్జీలతో ప్రజలపై భారంపడుతుంటే కొత్తగా ఇంధన సర్దుబాటు ధరలతో విద్యుత్ వినియోగదారులు అల్లాడిపోతున్నారన్నారు. గతంలో పోలిస్తే ఇప్పుడు ప్రతి నెలా రెండింతలు అధికంగా బిల్లులు వస్తున్నాయని మండిపడ్డారు. ఇంధన సర్దుబాటు ధరలను ప్రభుత్వమే విద్యుత్ డిస్కంలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడానికి బడ్జెట్ లేదంటూ ప్రజలను చంద్రబాబు దారుణంగా మోసగించారన్నారు. స్మార్ట్ మీటర్ల రాకతో మీటర్ రీడర్లు వీధిన పడే పరిస్థితిని కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ప్రజా కంటక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని త్వరలోనే ప్రజలు బంగాళాఖాతంలో కలపడం ఖాయమన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్ శాఖ ఈఈ జేవీ రమేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేంద్ర, బాల రంగయ్య, వి.రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సావిత్రి, పరమేష్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌కు జీవం పోస్తున్న టీడీపీ

- వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస



మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: జిల్లాలో ఫ్యాక్షన్‌కు జీవం పోసేలా టీడీపీ కుట్ర చేస్తోందని వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్ర రెడ్డి ఆరోపించారు. జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల పట్ల ఈ ప్రభుత్వానికి గౌరవం లేదన్నారు. స్థానిక సంస్థ ఉప ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో ఎన్నికల కమిషనర్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ఈ ఎన్నికల్లో టీడీపీ వ్యవహరించిందన్నారు. ఎంపీటీసీలకు రక్షణ కల్పించాలని హైకోర్టు నుంచి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఉత్తర్వులు తీసుకువచ్చినా.. జిల్లా పోలీసు యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టలేకపోవడం సిగ్గు చేటన్నారు. న్యాయ, పోలీసు వ్యవస్థను భ్రష్టు పట్టించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు యోగానంద రెడ్డి, నాయకుడు ఎంఎస్ఎస్ సాదిక్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్ జోన్‌లోనే కొనసాగించాలి



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

గుంతకల్లు: గుంతకల్లు డివిజన్‌ను యథావిధిగా సికింద్రాబాద్ జోన్‌లోనే కొనసాగించాలని గుంతకల్లు రైల్వే జోన్ సాధన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన గుంతకల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలోనే అత్యంత కరువు ప్రాంతమైన రాయలసీమలో విస్తరించి ఉన్న గుంతకల్లు డివిజన్ రైల్వేజోన్‌గా ఏర్పాటు చేస్తే అభివృద్ధికి దోహదపడేదన్నారు. అయితే విశాఖ రైల్వేజోన్‌గా ఏర్పాటు చేయడంతో రాయలసీమ అభివృద్ధిని అడ్డుకోవడమే అన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం కర్నూలు వచ్చిన హైకోర్టు న్యాయ కార్యాలయాలను తరలించి రాయలసీమకు ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ జోన్ గుంతకల్లు రైల్వే ఉద్యోగులకు, ప్రజలకు అనుకూలంగా ఉండదన్నారు. ఎందుకంటే దాదాపు 750 కి.మీ.కు పైగా దూరం ఉండటంతోపాటు కార్యాలయ పనులపై వెళ్లాలంటే కనీసం మూడు రోజులు సమయం వృథా అవుతుందన్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు కాశీరావు, గురుశంకర్, జ్ఞానేశ్వర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, వేమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'పది' మూల్యాంకనంపై మార్గదర్శకాల విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనంలో అసిస్టెంట్ ఎగ్జామినర్లు (ఏఈ) రోజుకు 40 పేపర్లు మాత్రమే దిద్దాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏప్రిల్ 3 నుంచి 9వ తేదీ వరకు ఏడు రోజుల పాటు మూల్యాంకనం జరుగుతుందని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వం రూపొందించిన విధివిధానాలపై పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మార్గదర్శకాలు ఇలా...

- అసిస్టెంట్ ఎగ్జామినర్లు ఒక రోజులో 40 జవాబు పత్రాలను మాత్రమే మూల్యాంకనం చేయాలి.
- మూల్యాంకనం చేసిన అన్ని సమాధాన పత్రాల మార్కులను స్పెషల్ అసిస్టెంట్లు లెక్కించాలి.
- ప్రతి అసిస్టెంట్ ఎగ్జామినర్ మూల్యాంకనం చేసిన కనీసం 20 జవాబు స్క్రిప్ట్‌లను చీఫ్ ఎగ్జామినర్ ధ్రువీకరించాలి. అంటే మొత్తం 120 జవాబు స్క్రిప్ట్‌లు ధ్రువీకరించాల్సి ఉంటుంది.
- అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు ప్రతి అసిస్టెంట్ ఎగ్జామినర్ నుంచి కనీసం రెండు స్క్రిప్ట్‌లను తనిఖీ చేయాలి.
- శిబిరం ప్రారంభమైన రోజు నుంచి పూర్తయ్యే వరకూ పోలీసు సిబ్బందితో గట్టి భద్రతను నిర్వహించాలి.
- స్పాట్ వాల్యూయేషన్ పూర్తయిన తర్వాత సీఈ, ఏఈ, స్పెషల్ అసిస్టెంట్ల జాబితాను వెంటనే ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌కు పంపాలి.
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, విపరీతమైన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా, స్పాట్ వాల్యూయేషన్ క్యాంపులో ఏఎన్ఎం, ప్రథమ చికిత్స కిట్, అవసరమైన మందులు, కూల్ డ్రింకింగ్ వాటర్ సదుపాయం, ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేయాలి.
- మూల్యాంకనం సజావుగా జరిగేలా జిల్లాస్థాయి పరిశీలకులుగా నియమించినవారు స్పాట్ వాల్యూయేషన్ పరిశీలకులుగా వ్యవహరిస్తారు.

విధుల నిర్వహణలో అలసత్వాన్ని సహించం

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం



గర్భకోశ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీటీ వైద్యురాలు డాక్టర్ జ్యోతి సుచిత్ర

బత్తలపల్లి: సమయానికి ఆస్పత్రికి చేరుకుని రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించబోమని వైద్య, ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం హెచ్చరించారు. శుక్రవారం బత్తలపల్లిలోని పీహెచ్‌సీని డిప్యూడీ డీఎంహెచ్ఓ సెల్వియి సాలమన్, డీఐఓ శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర నాయక్‌తో కలసి ఆమె తనిఖీ చేశారు. ల్యాబ్‌ను పరిశీలించారు. రోజు వారీ ఓపీపై ఆరా తీశారు. రోగులకు ఆయుష్మాన్ భారత్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని వైద్యాధికారి గోవర్ధన్‌నాయుడుకు సూచించారు. వడదెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. అనంతరం గర్భకోశ క్యాన్సర్ నిర్ధారిత పరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. పీహెచ్‌సీ పరిధిలోని పలువురు మహిళలకు ఆర్డీటీ ఆస్పత్రి గైనకాలజిస్టులు డాక్టర్ జ్యోతి సుచిత్ర, శిల్ప, రమ్య... గర్భకోశ క్యాన్సర్ నిర్ధారిత పరీక్షలు నిర్వహించారు. ప్రతి మూడేళ్లకు ఈ తరహా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ మహారాజ్, సూపర్‌వైజర్ చంద్రశేఖర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ రాఘవేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించండి..

ధర్మవరం రూరల్: వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం సూచించారు. ధర్మవరం మండలం దర్శనమలలోని పీహెచ్‌సీ, రావులచెరువులోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను డీఐఓ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్‌తో కలసి శుక్రవారం ఆమె పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దిలీప్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బుగ్గ రామలింగేశ్వరుడికి పూజలు



అలంకరణలో బుగ్గ రామలింగేశ్వరస్వామి

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని పెన్నానది ఒడ్డున వెలసిన స్వామివారికి తెల్లవారుజామున రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి వెండి తొడుగును ధరింపజేసిన అర్చకులు ప్రత్యేకంగా వివిధ రకాల పూల దండలతో అలంకరించారు. పార్వతీ మాతను ఉదయం వివిధ రకాల పూల మాలలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కసాపురంలో రేపటి నుంచి ఉగాది ఉత్సవాలు



విద్యుద్దీపాలంకరణలో వెలుగులీనుతున్న ఆలయం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో రేపటి నుంచి విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో పాల్గొనేందుకు భక్తులు భారీ ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బెంగళూరు నుంచి తెప్పించిన ప్రత్యేక పుష్పాలతో, విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. ఆలయ ప్రాంగణం, గంగా నిలయం వద్ద చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఆలయ ముందు భాగంలోని రెండు పార్కులను సుందరీకరించారు. గుంతకల్లు మున్సిపాలిటీ నుంచి నిరంతరంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని రెండు ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. భక్తుల కాలక్షేపం కోసం రోజూ వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు.

ఉత్సవాలు ఇలా...

ఉత్సవాల షెడ్యూల్‌ను ఆలయ ఈఓ కె.వాణి శుక్రవారం వెల్లడించారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 30న తొలిరోజు గ్రామోత్సవం ఉంటుంది. సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామ పురవీధుల గుండా శమీ వృక్షం వరకూ ఊరేగించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ముఖ మంటపం ఎదుట ప్రత్యేక వేదికపై పంచాంగ శ్రవణ కార్యక్రమం ఉంటుంది. రెండో రోజు ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 31న స్వామి వారి రథోత్సవం ఉంటుంది. మూడో రోజు ఏప్రిల్ 1న లంకా దహనం కార్యక్రమం ఉంటుంది. ఆ రోజు సాయంత్రం 6గంటలకు విశేష అలంకరణలో ఒంటె వాహనంపై కొలువుదీరిన ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని ఆలయ సమీపంలోని కాశీవిశ్వేశ్వరాలయం వరకూ ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ఆంజనేయస్వామి వారి చేతుల మీదుగా లంకా దహనం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పోలీస్ ఔట్ పోస్టు వద్ద ఉన్న ఖాళీ స్థలంలో దాదాపు రెండు గంటల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'క్షుద్ర పూజలతో బలిగొన్నారు'

గుత్తి: క్షుద్ర పూజలు చేయడం వల్లనే తన కుమారుడు మరణించాడంటూ పోలీసులకు బాధిత తండ్రి ఫిర్యాదు చేశాడు. వివరాలు... గుత్తిలోని ఆచారి కాలనీలో నివాసముంటున్న వేణుగోపాలాచారి కుమారుడు వీరాచారి కోట వీధిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గత ఫిబ్రవరి 22న పాఠశాల సమీపంలో ఉన్న బావిలోకి ఈతకు వెళ్లి రాజా మృతి చెందాడు. ఘటనకు సంబంధించి అనుమానాలు వ్యక్తం చేస్తూ శుక్రవారం గుత్తి పోలీసులకు వేణుగోపాలాచారి ఫిర్యాదు చేశాడు. తమ ఇంటి వద్దనే నివాసముంటున్న మాణిక్యం, ఆయన భార్య మహాలక్ష్మి, శివశంకరాచారితో తమకు వివాదం ఉందని, ఈ క్రమంలో వారు క్షుద్రపూజలు చేయడం వల్ల ఇంటిల్లిపాది అనారోగ్యంతో బాధపడుతున్నామని, తన కుమారుడి పేరును ఓ బొమ్మపై రాసి క్షుద్ర పూజలు చేసి బావిలో పడేయడంతో గత ఫిబ్రవరి 22న ఈతకని వెళ్లి అదే బావిలో కుమారుడు మృతి చెందాడంటూ పేర్కొన్నారు. తన కుటుంబం అనారోగ్యం పాలు కావడానికి, కుమారుడు మృతి చెందడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ కోరారు. ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేపట్టారు.

పట్టాలపై యువకుడి మృతదేహం

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో పట్టాలపై గుర్తు తెలియని యువకుడి (20) మృతదేహాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. నీలం రంగు షర్టు, ప్యాంటు ధరించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి కిందపడ్డాడా? లేక ఆత్మహత్య చేసుకున్నాడే అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

3న ఎస్‌ఆర్‌ఐటీలో జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం



పోస్టర్లు విడుదల చేస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి, సిబ్బంది

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురం వద్ద ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) కళాశాలలో ఏప్రిల్ 3వ తేదీన తరంగ్–2కే25 పేరుతో జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన కళాశాల విడుదల చేసి, మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు తమ సాంకేతిక ప్రతిభను ప్రదర్శించడానికి ఈ వేదిక దోహదపడుతుందన్నారు. ఉత్సవంలో భాగంగా వివిధ సాంకేతిక పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పేపర్ ప్రెజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, కోడ్ బజ్, ఐఓటీ, హ్యాకథాన్, టెక్నికల్ క్విజ్, సర్క్యూట్ మేనియా, మోడల్ ఎక్స్‌పో, బ్రిడ్జి, బ్లిట్జ్, క్లూ క్రాఫ్ట్, మినిట్ మాస్ట్రో పిక్సెల్, పర్ఫెక్షన్ లాంటి ఆసక్తికరమైన ఈవెంట్లను నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు నగదు పురస్కారాలతో పాటు సర్టిఫికెట్లనూ అందజేస్తామన్నారు. సదస్సులో ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఈవెంట్ కన్వీనర్ డాక్టర్ చిత్ర లింగప్ప, ఐక్యూసీ డైరెక్టర్ డాక్టర్ హేమంత్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సైనిక సంక్షేమ నిధికి డ్వాక్రా మహిళల విరాళం

ప్రశాంతి నిలయం: మెప్మా సహకారంతో వ్యాపారంలో స్వయంసమృద్ధి సాధిస్తున్న డ్వాక్రా మహిళలు... సైనిక సంక్షేమ నిధికి రూ.75 వేల విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో కలెక్టర్ చేతన్ సమక్షంలో జిల్లా సైనిక సంక్షేమాధికారికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సైనిక సంక్షేమ నిధి కోసం భారీగా విరాళాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏపీ మెప్మాకు దక్కిన 3 గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులను కలెక్టర్‌కు అందజేశారు. గిన్నిస్ రికార్డులు రావడానికి గల కారణాలను, ప్రత్యేకతలను వారు కలెక్టర్‌కు వివరించారు.

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం



హర్షవర్ధిని (ఫైల్)

రాప్తాడు రూరల్: మార్కుల ఒత్తిళ్లు ఓ ఇంటర్ విద్యార్థిని బలిగొన్నాయి. వివరాలు.. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీ పరిధిలోని జీఎం కాలనీకి చెందిన లక్ష్మన్న కళ్యాణదుర్గంలో సెరికల్చర్ శాఖలో పని చేస్తున్నారు. ఆయనకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె హర్షవర్ధిని (17) నగర శివారులోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ ఇటీవల పబ్లిక్ పరీక్షలు రాసింది. అయితే పరీక్షలు తాను సక్రమంగా రాయలేదని, ఆశించిన స్థాయిలో మార్కులు రావేమోననే అనుమానంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైన ఆమె శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన చుట్టుపక్కల వారి నుంచి సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు ఇంటికి చేరుకుని బోరున విలపించారు.